క్లుప్తంగా

మత్తు పదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రాజేశ్ నాయక్

మునిపల్లి(అందోల్): మత్తు పదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బుదేరా ఎస్‌ఐ రాజేశ్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని బుదేరా శివారు 65వ నంబర్ జాతీయ రహదారిపై వివిధ వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. జిల్లా ఎస్పీ రూపేశ్ ఆదేశాలతో వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించామన్నారు. అక్రమంగా గంజాయి, మత్తు పదార్థాలను తరలిస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా వెంట ఉండాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపిన 12 మందిపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



మనోహర్‌రావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అనారోగ్యంతో బాధపడుతున్న విశ్రాంత ఎంపీడీఓ మనోహర్‌రావు, మండలంలోని అంత్వార్‌కు చెందిన విజయ్‌పటేల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పరామర్శించారు. ఆదివారం వారి నివాస గృహాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, మాజీ సర్పంచ్ గుండెరావు, అవుటి శంకర్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

నేడు డపూర్‌లో రచ్చబండ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని డపూర్ గ్రామంలో సోమవారం రచ్చబండ నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎం. రవీందర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు నిర్వహించే రచ్చబండకు జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ హాజరుకాబోతున్నట్లు తెలిపారు. రెండు ఎకరాలను ఫార్మా సిటీ కోసం మండల పరిధిలోని డపూర్, వడ్డి, మల్గి గ్రామాల పరిధిలోని భూములను రైతుల అనుమతి లేకుండా ప్రభుత్వం భూ సేకరణ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సారవంతమైన భూములను లాక్కుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఫార్మాసిటీ కంపెనీలను అడ్డుకునేందుకు పార్టీలకతీతంగా అందరూ కలిసి రావాలని ఆయా గ్రామాల ప్రజలను కోరారు.

పంచముఖ హనుమాన్ నూతన కార్యవర్గం

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణం కృష్ణా నగర్ కాలనీలోని పంచముఖ హనుమాన్ ఆలయ కమిటీ నూతన అధ్యక్ష అధ్యక్షులుగా కార్యవర్గ సభ్యులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా గురువు నాగరాజ్, గౌరవ అధ్యక్షులుగా నెమలికొండ వేణుమాధవ్, ఉపాధ్యక్షులుగా షేర్ దొడ్డి సంగన్న, బామిని రవి, బోయని జగదీశ్, కోశాధికారులుగా బూస శేఖర్, మంబి గారి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఆటిపాముల ఆనంద్, కార్యదర్శులుగా గంజి రాజు, కొత్త రమేష్, గుండు భిక్షపతి, సంయుక్త కార్యదర్శులుగా బంటు మధు, బీదర్ నాగరాజు, బోడుగ రజనీకాంత్, సలహాదారులుగా నల్ల అశోక్ గౌడ్, విజయ్ కుమార్, దోమకొండ నరేష్, విజయ్ కుమార్, కళ్యాణ్ రాజు, గుండు రవి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దైవ చింతనతోనే మనసుకు ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఖుషి డిఫెన్స్ కాలనీలో అభయ ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరై ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కుమార్‌ను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన వితరణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కృషి డిఫెన్స్ కాలనీవాసులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠాపనలో కార్పొరేటర్

● ట్రాఫిక్‌తో.. బెరుకు



తెల్లాపూర్ మున్సిపల్.. కొల్లూరు గ్రామం.. ప్రధాన రహదారిపై నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. గ్రామ ముఖద్వారం వద్ద రోడ్డు మధ్యలో ఓ విగ్రహం ఏర్పాటు కోసం గతంలో సిమెంట్ దిమ్మె నిర్మించారు. దాంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అసలే ఇరుకైన రోడ్డు.. పైగా దిమ్మె ఏర్పాటు చేయడంతో వాహన రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాల సైతం రాకపోకలు సాగిస్తున్నాయి. దాంతో ట్రాఫిక్ మరింత జటిలంగా మారుతోంది. -రామచంద్రాపురం(పటాన్‌చెరు)

● జలాలతో.. వణుకు



కంది మండలం.. కాశీపూర్‌లోకి వెళ్లే దారిలో చెరువు అలుగుపై బ్రిడ్జి లేక వాహనదారులు, కాలి నడకన వెళ్లే వారు అవస్థలు పడుతున్నారు. వర్షా కాలంలో వాన నీటి వల్ల గ్రామం మధ్యలో ఉన్న చెరువు నిండి.. అలుగుపై నుంచి పారుతుంటుంది. ఈ దారిగుండా వెళ్లే కలివేముల, చెర్లగూడెం, తోపుగొండ, శంకర్‌పల్లి మండలం గాజులగూడ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆయా గ్రామాలకు వెళ్లే వారు నీటి ఉధృతి తగ్గే వరకు ఆగాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - కంది(సంగారెడ్డి)

● ప్రయాణం బెణుకు



సదాశివపేట రూరల్ మండలం.. సిద్ధాపూర్ మీదుగా రేజింతల్‌కు వెళ్లే ప్రధాన రహదారికి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రహదారి గుండా కొండాపూర్ మండలం సైదాపూర్, అనంతసాగర్, వికారాబాద్ జిల్లాలోని టేకులపల్లి, ఎన్కతల గ్రామాలకు రోజు వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రాత్రి పూట ప్రయాణంలో వాహనదారులు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారని పలువురు స్థానికులు, ప్రజలు వాపోతున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - సదాశివపేట రూరల్

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

- వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే సమయం
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు, వైద్యులు



హత్నూర(సంగారెడ్డి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు గ్రామాల్లో ప్రబలే ప్రమాదం ఉంది. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధుల నుంచి బయటపడవచ్చని వైద్యులు పేర్కొన్నారు. నివారణపై వైద్యుల సలహాలు సూచనలపై కథనం.

- **మలేరియా :** జ్వరం, చలి వణుకు లక్షణాలుంటే చికిత్స పొందాలి. రక్త పరీక్ష చేసిన వెంటనే మలేరియా క్రిములు కనబడవు శరీరంలోకి ప్రవేశించిన తర్వాత కొద్ది రోజులకు మాత్రమే ఇవి రక్త పరీక్షల్లో బయటపడతాయి. అప్పటి వరకు వేచి చూస్తే మలేరియా మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. రోగ కారణాలు మెదడు మీద ప్రభావం చూపే సెరిబ్రల్ మలేరియాకు దారి తీసే అవకాశం ఉంది. ఇది ప్రాణాంతకం ముఖ్యంగా చిన్నారులు ఈ మలేరియా బారిన పడే అవకాశం ఉంది.
- **జాగ్రత్తలు:** దోమ కాటుకు గురి కాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలి. నీటి తొట్లను మూడు రోజులకొకసారి ఖాళీ చేసి, మళ్లీ తాజా నీటిని నింపుకోవాలి. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి బోండాలు వాడి పడేసిన టైర్లు ఉండకూడదు. కూలర్లలో నీటిని మూడు రోజులకోసారి మార్చుకోవాలి.
- **డెంగీ:** ఈడెస్ ఈజిప్టు దోమ కుట్టిన తర్వాత 5 నుంచి 8 రకాల లక్షణాలు కనిపిస్తాయి. ఉన్నట్టుండి జ్వరం ఎక్కువగా వస్తుంది. తలనొప్పి అధికమవుతుంది. కంటి కదలిక సమయంలో భరించలేని నొప్పి ఉంటుంది. కండరాలు కీళ్ల నొప్పులతో పాటు వాంతులు అయినట్టుగా ఉంటుంది. నోరు ఎండిపోవడం అధికదాహం ఒళ్లు నొప్పులు శరీరంపై ఎర్రటి దురదలు. నాడి నెమ్మదిగా కొట్టుకోవడం, రక్తపోటు నమోదు పడిపోవటం వంటివి డెంగీ లక్షణాలు.
- **జాగ్రత్తలు:** ఉదయం సమయంలో జాగ్రత్తగా ఉండాలి. పూల కుండీలు ఎయిర్ కూలర్లు నీటి నిల్వ తొట్లు నీటి టబ్‌లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. శరీరాన్ని పూర్తిగా కప్పి ఉండేలా ప్యాంట్, షర్టులు ధరించాలి. దోమలు కుట్టకుండా లేపనాలు రాసుకోవాలి. పగటిపూట కూడా దోమతెరలు వాడాలి.
- **మెదడు వాపు:** పందుల నుంచి వైరస్‌ను గ్రహించి మనుషిని దోమ కుట్టడం ద్వారా మెదడు వాపు సంక్రమిస్తుంది. పది రోజుల వ్యవధిలో వ్యాధి లక్షణాలు బయటపడతాయి. మనిషి నుంచి మనిషికి వ్యాప్తి చెందదు. ఈ వ్యాధి 1 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు వచ్చే అవకాశం ఎక్కువ. వారిలో ఆకస్మికంగా జ్వరం వస్తుంది. అసాధారణంగా కళ్లు తిరుగుతాయి. పక్షవాతానికి గురయ్యే ప్రమాదం ఉంది. వాంతులు విరేచనాలవుతాయి. కొన్నిసార్లు ఫిట్స్ కూడా రావచ్చు.
- **జాగ్రత్తలు:** దోమలు కుట్టకుండా జాగ్రత్త తీసుకోవాలి. దోమ తెరను వాడాలి. ఇంట్లోకి ఇవి రాకుండా కిటికీలు తలుపులు సన్నటి జాలీలను బిగించుకోవాలి. గ్రామాల్లో, ఇళ్ల మధ్యలో పందులు తిరగకుండా చూసుకోవాలి. మురుగు గుంతలు ఇంటి చుట్టుపక్కల ఉంటే అందులో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. పిల్లలకు జ్వరం వస్తే ఆలస్యం చేయకుండా సమీప ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాలి.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి



ప్రస్తుత వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. స్వీయ నియంత్రణ చర్యలతోనే నివారించవచ్చు. పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. జ్వరం వస్తే అశ్రద్ధ చేయకూడదు. వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. దోమల తెరలను వినియోగిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి.

– రజిని, హత్నూర వైద్యాధికారి

సమస్యలపై మంత్రి దామోదరకు వినతి



మంత్రి దామోదరకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేశ్ తదితరులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం ఆయన నివాసంలో కార్పొరేటర్ పుష్పనగేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ప్రధాన సమస్యలపై వినతిపత్రం ఇచ్చామన్నారు. అలాగే డివిజన్‌లో పర్యటించాలని కోరినట్లు తెలిపారు. మంత్రి దామోదర సానుకూలంగా స్పందించారన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

స్థానిక జెడ్పీ పాఠశాలలో ఆదివారం 2006–07 బ్యాచ్.. పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. –రామచంద్రాపురం(పటాన్‌చెరు)

భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నగర సంకీర్తన కార్యక్రమాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున భక్తులు హనుమాన్ మందిరానికి చేరుకుని అక్కడి నుంచి భజనలు, కీర్తనలు ఆలపిస్తూ హౌసింగ్ బోర్డు కాలనీ వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, పిల్లలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగర సంకీర్తన ముగిసిన అనంతరం నిర్వాహకులు భక్తులకు అల్పాహారం అందజేశారు.

బసవ జ్యోతి..

పట్టణంలోని దత్తగిరి కాలనీలో గల బసవ మండపంలో ఆదివారం బసవ జ్యోతి కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకుని నిర్వహించిన బసవ జ్యోతి కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడికి పూజలు నిర్వహించి ప్రార్థనలు చేశారు. వక్తలు బసవ ప్రవచనాలను బోధించారు.

వర్షాలు సమృద్ధిగా కురవాలని..

- కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తుల పాదయాత్ర



ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ ఆలయంలో పాదయాత్ర బృందం సభ్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్), ఝరాసంగం(జహీరాబాద్): కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన భక్తులు ఆదివారం భజనలు చేసుకుంటూ పాదయాత్రగా కేతకీ ఆలయానికి చేరుకున్నారు. ఈ యాత్ర న్యాల్‌కల్ మండలం మల్గి, డప్పూర్, అత్నూర్, న్యాల్‌కల్, రుక్మాపూర్‌ల మీదుగా ఆలయం వరకు సాగింది. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ఈ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఈ ప్రాంతానికి ఏటా వస్తుంటారు. 19 ఏళ్లుగా శ్రావణమాసం పురస్కరించుకొని ఆలయానికి పాదయాత్రగా వస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. 5 రోజుల క్రితం ఈ యాత్ర ప్రారంభంకాగా సోమవారం అమృతగుండంలో స్నానమాచరించి స్వామిని దర్శించుకుని తిరిగి వెళ్తారు. అత్నూర్ గ్రామస్తులు స్వాగతం పలికారు.

నేడు ఆర్డీఓ కార్యాలయం ముట్టడి



మాట్లాడుతున్న మహిపాల్ తదితరులు

జహీరాబాద్ టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న ఆర్డీఓ కార్యాలయం ముట్టడిస్తున్నట్లు సీపీఎం కార్యదర్శి మహిపాల్ అన్నారు. పట్టణంలోని శ్రామిక భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీ ఆధ్వర్యంలో పది రోజుల పాటు పట్టణంలో బస్తీ బాట ద్వారా ప్రజల్లోకి వెళ్లామన్నారు. అనేక సమస్యలను పెద్ద సంఖ్యలో నివేదించారన్నారు. ప్రధానంగా రహదారులు, సీసీ రోడ్లు, మురుగు కాలువలు, డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ, తాగా నీటి సమస్య, రేషన్ కార్డులు, క్రీడా ప్రాంగణంలో వసతుల కల్పన తదితర సమస్యలను పరిష్కరించాలని వినతులు వచ్చాయన్నారు. వాటికి పరిష్కారం చూపాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఈ మేరకు 12న ఆర్డీఓ కార్యాలయం ముట్టడించి ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం నాయకులు సలీమోద్దీన్, తిరుపతి, నరేశ్, బక్కన్న, శాంతమ్మ, రాజు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి కృషి

- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



మధు ముదిరాజ్‌ను సన్మానిస్తున్న కోలీ సామాజికవర్గ సభ్యులు

పటాన్‌చెరు: జాతీయ స్థాయిలో కోలీ (ముదిరాజ్) సమాజ్ బలోపేతానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం కర్ణాటకలోని చించోలి నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. ఈ పట్టణ కేంద్రంలోని కోలీ సమాజ్ భవనంలో సభ్యులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి స్థానిక ఇన్‌చార్జి, కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాశ్ రాథోడ్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చించోలి కోలీ సమాజ్ ఆధ్వర్యంలో నీలం మధును ఘనంగా సత్కరించారు. కోలీ సమాజ్ భవనానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. దక్షిణ భారతదేశంలో రెండు కోట్లకు పైగా దేశ జనాభాలో 6 శాతం పైగా ఉన్న కోలీ సమాజ్ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మన కోలీ సమాజాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి మనమంతా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోలి సమాజ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, కాంగ్రెస్ నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ సురేశ్, నియోజకవర్గ కోలి సమాజ్ ప్రెసిడెంట్ అనిల్ జమేదార్, రాములు షాదీపూర్, వెంకట్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



భవానీ చౌరస్తాలో వెలగని ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు

సిగ్నల్ లైట్లకు మరమ్మతులేవీ?

- అస్తవ్యస్తంగా మారిన ట్రాఫిక్
- ఏ వాహనం ఎటు వెళుతుందో తెలియని పరిస్థితి
- సాంకేతిక లోపమే కారణమా?
- పట్టించుకోని అధికారులు

జహీరాబాద్ టౌన్: ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు పని చేయడం లేదు. సాంకేతిక లోపమో ఏమిటో తెలియరాలేదు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు వాహనాల రాకపోకలు సులభతరం కోసం ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం ఇవి వెలగడం లేదు. దీంతో పట్టణంలోని ట్రాఫిక్.. అస్తవ్యస్తంగా మారింది. ఏ వాహనం ఎటు వెళుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. జహీరాబాద్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం భవానీ మందిర చౌరస్తా, బస్టాండ్ ఎదుట, పస్తాపూర్ చౌరస్తాతో పాటు బాగారెడ్డి విగ్రహం వద్ద ప్రధాన చౌరస్తాలో సిగ్నల్ లైట్లను ఏర్పాటు చేశారు. ప్రారంభ సమయంలో సవ్యంగా పని చేశాయి. వాహనదారులు సిగ్నల్‌ను అనుసరించడం వల్ల కొంత వరకు ట్రాఫిక్ సమస్య తొలగింది. కొన్ని నెలల తరువాత సిగ్నల్స్ అప్పుడప్పుడు వెలగకపోవడంతో వెంటనే మరమ్మతులు చేసేవారు. ఇటీవల కాలం నుంచి ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు పనిచేయడం లేదు. వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహన చోదకులు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఏ వాహనం ఎటు వెళుతుందో తెలియక రోజు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా పోలీసులు స్పందించి వెంటనే వీటికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కౌన్సిల్ చైర్మన్‌గా శ్రీనివాస్**

నారాయణఖేడ్: సమైఖ్య హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్‌గా ఖేడ్‌కు చెందిన శివాజీ శ్రీనివాస్‌ను నియమిస్తూ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ సాయికుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ శివాజీ మాట్లాడుతూ ఖేడ్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ, చైతన్యం కోసం తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.

◆ **అంత్యక్రియలకు ఆర్థిక సహాయం**



నారాయణఖేడ్: మండలంలోని మాద్వార్‌కు చెందిన కొవ్వూరి లక్ష్మయ్య ఆదివారం తెల్లవారుజాము గుండెపోటుతో మృతిచెందారు. అంత్యక్రియల నిర్వహణ కోసం గుర్రపు మశ్చందర్ ఫౌండేషన్ చైర్మన్, ప్రవాస భారతీయులు గుర్రపుమశ్చందర్ రూ.10 వేలను ఆ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, అభిపవార్, అనుముల తుకారాం, సంతోశ్ నాయక్‌లతో పంపించారు. వారు బాధిత కుటుంబీకులకు అందజేశారు. మాజీ సర్పంచ్ ఈశ్వర్ గౌడ్, గ్రామపెద్దలు నర్సింహులు, పెద్దరామయ్య, చిన్న రామయ్య, ఈశ్వర్‌తో పాటు గ్రామస్తులు మశ్చందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

◆ **శ్రావణ మాస పూజలు**



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని టేకూర్‌లో కొలువై ఉన్న మల్లికార్జున స్వామి దేవాలయలంలో నిత్యం శ్రావణ మాస పూజలు కొనసాగుతున్నాయి. రోజూ ఉదయం ఆలయంలో దంపతులు స్వామి వారికి అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహిస్తున్నారు. నెల రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. చివరి రోజున ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం నిర్వహిస్తామన్నారు.

◆ **పంటలను నమోదు చేసుకోండి**

కంది(సంగారెడ్డి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసుకుంటున్న పంటల వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ రైతులకు సూచించారు. సాగు వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకుంటే కొనుగోలు చేసే సమయంలో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. నష్ట పరిహారం పొందే కూడా అవకాశం కలుగుతుందన్నారు. ఈనెలాఖరు వరకు రైతులందరూ పంటల నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

◆ **ఆలయ నిర్మాణానికి విరాళం**

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని తుక్యతండాలో నూతనంగా నిర్మిస్తున్న జగదాంబదేవి, సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణం కోసం మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ.50వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం ఏర్పడుతుందన్నారు. అందరూ సన్మార్గంలో నడవాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌నాయక్, రవినాయక్, నరేశ్, పుల్‌సింగ్, ప్రకాశ్, తేజ, నర్సింగ్ తండావాసులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

మండల కేంద్రమైన శివ్వంపేటలో ఇటీవల చిన్న భాగ్యమ్మ మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను, అనారోగ్యంతో బాధపడుతున్న కుమ్మరి ముత్యాలు, లస్కరి కుమార్, పుష్పలతలను మహేశ్‌గుప్తా పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.